బడి గంటతో బేజారు

- తల్లిదండ్రులపై చదువుల భారం
- నగటు జీవులకు 'జూన్' భయం



బాలాజీచెరువు: వేసవి సెలవులు ముగిసి గురువారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు నింగినంటి సగటు జీవి కుదేలయ్యాడు. ఇది చాలదన్నట్టు జూన్ నెల వస్తోందంటేనే విద్యార్థుల చదువులకు తారాస్థాయిలో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఫీజులు మోయక తప్పని పరిస్థితి. స్కూల్ ఫీజులు, బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బస్సు, ఆటో చార్జీలు చెల్లించాల్సిందే. ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున అందజేస్తే కొంత భారం తగ్గేదని, ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

చుక్కల్లో ఫీజులు...

కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. సాధారణ ప్రైవేటు స్కూల్లో ప్రాథమిక తరగతులకు కనీసం రూ.30 వేల నుంచి రూ.40 వేలు, ఉన్నత పాఠశాలల తరగతులకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో వీటికి 100 శాతం అధికంగా ఉన్నాయి.

పాఠ్యపుస్తకాలకు అదనపు వసూళ్లు

పాఠశాలలు ఆరంభం కాగానే మొదటి ప్రాధాన్యం పుస్తకాల కొనగోళ్లదే. సాధారణ ప్రైవేటు స్కూళ్లలో ఐదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు కలిపి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చవుతాయి. అదే కార్పొరేట్ విద్యా సంస్థల్లో రూ.8,100 నుంచి రూ.9,800 వరకు వెచ్చించాల్సిందే.

పాఠ్య పుస్తకాలతో పాటు వాటిని మోసే బ్యాగుల ధరలు కూడా ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ఏడాదిలో రెండు బ్యాగులు తప్పనిసరయ్యాయి. ఒక్కో బ్యాగు రూ.500 నుంచి రూ.800 వరకు ఉంటుంది. వీటితో పాటు కంపాస్ బాక్సు, పెన్నులు, పెన్సిల్ తదితర ఖర్చులు లేకపోలేదు. బూట్లు, టైల ధరలు కూడా తక్కువేంకాదు. ఒక్కో స్కూల్ యూనిఫాం రూ.1,500 వరకు ధర పలుకుతున్నాయి. ఒక్కో విద్యార్థికి తెలుపు, నలుపు రెండు రకాల బూట్లు తప్పనిసరి. సాక్సు రెండు జతలు రూ.600. ఆయా పాఠశాలల్లో యాజమాన్యాలే టైలను విక్రయిస్తాయి. ఒక్కో టై రూ.500 నుంచి రూ.550 వరకు ఉంటుంది. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాను గుర్తు చేసుకుని నేడు అవేమీ లేకపోవడంతో కలవరపడు తున్నారు.

జీతం రూ.18 వేలు.. ఖర్చు రూ.25 వేలు

నగర పరిధిలో శ్రీనివాసరావు జేఎన్టీయూకేలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. ఆయనకు నెల వేతనం రూ.18 వేలు, నిత్యం బైక్‌పై వచ్చి వెళ్లేందుకు రూ.వంద చొప్పున పెట్రోల్‌కు నెలకు రూ.3 వేలు ఖర్చు. నెలకు ఇంట్లో పచారీకి రూ.10 వేలు, విద్యుత్ బిల్లు రూ.900 వరకూ చెల్లిస్తున్నారు. ఇద్దరు పిల్లలను ప్రైవేటు స్కూల్లో చదివిస్తున్నారు. వీరికి పుస్తకాలు, ఫీజులు కలిపి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు చెల్లించాలి. రెండు రోజుల్లో పాఠశాలలు. ప్రారంభం కానుండడంతో పాఠశాల నిమిత్తం మరో రూ.20 వేలైనా ఖర్చు చేయాల్సిందే. రూ.18 వేల జీతంతో వాటిని ఎలా చెల్లించేదని తల పట్టుకుంటున్నాడు. ఒక్కో పాఠశాల ఒక్కో రకమైన యూనిఫాంను రూపొందించాయి. యూనిఫాంల ధరలు రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలే వాటిని విక్రయిస్తున్నాయి.

ఫీజులను నియంత్రించాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజులు నియంత్రించాలి. కార్పొరేట్ స్కూళ్లన్నీ విద్యను వ్యాపారంగా మార్చేశాయి. వాటిని నియంత్రించే వ్యవస్థ కరువైంది. ప్రైవేటు పాఠశాలలకు ఆధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారు. చివరికి నష్టపోయేది విద్యార్థులు, వారి తల్లిదండ్రులే. ఫీజుల నియంత్రణ బాధ్యతను ప్రభుత్వాలు పారదర్శకంగా తీసుకోవాలి.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

జూన్ నెలంటేనే భయం



ఏడాదిలో జూన్ నెలంటే భయమేస్తుంది. ఆర్థిక భారాన్ని తట్టుకోలేని పరిస్థితి. పిల్లల ఫీజులు, యూనిఫాం, ఇతరత్రా ఖర్చులతో కూడిన నెల ఇది. మరీ ముఖ్యంగా పిల్లల ఫీజుల విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏడాదికి ఏడాది ఫీజులు 10 శాతం కంటే ఎక్కువే పెంచుతున్నారు.

– ఎం.దొరనాయక్, కాకినాడ

ఫిర్యాదులు వస్తే చర్యలు..



ప్రైవేటు పాఠశాలలపై శాఖాపరమైన పర్యవేక్షణ ఉంది. ఫీజులు పెంచడం గానీ ప్రభుత్వ పుస్తకాలు కాకుండా ప్రైవేటు పుస్తకాలతో బోధనలను నిర్వహించడం గానీ చేస్తే అది నిబంధనలకు విరుద్ధం. అలాంటి పాఠశాలలపై ఫిర్యాదుల వస్తే చర్యలు తప్పవు.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ జేడీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మెగా డీఎస్సీ కోసం శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలని సోషల్ వేల్ఫేర్ జేడీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోషల్ వేల్ఫేర్‌శాఖ ద్వారా స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ మంగళవారంతో ముగిసింది. మూడు నెలలుగా శిక్షణ పొందిన అభ్యర్థులు తప్పకుండా విజయం సాధించాలన్నారు. మంచి శిక్షణ ఇచ్చిన ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్‌ను ఆయన అభినందించారు. శ్యామ్ మాట్లాడుతూ సోషల్ వేల్ఫేర్ శాఖ ద్వారా 260 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించేలా వారికి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు కొందరు మాట్లాడుతూ తమ అంచనాలకు మించి ఒక ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇచ్చారన్నారు. మెరుగైన భోజనం, వసతి, వారాంతపు పరీక్షలు, ఎంతో ఉపయోగపడే స్టడీ మెటీరియల్ అందించారన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

కాకినాడ రూరల్: మరణించిన తరువాత మన శరీరంతో పాటు కళ్లు మట్టిలో కలిసిపోతాయని, ముందుగానే అవయవదానంపై అవగాహన పెంపొందించుకుని కళ్లు దానం చేసేందుకు అంగీకరించడం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించిన వారమవుతామని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ నేత్ర దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు, ఓం నమశ్శివాయ, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

కాకినాడ సిటీ: జిల్లాలో ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏప్రిల్, మే నెలలో చేసిన పనులకు వేతనాలను సత్వరం ఇప్పించాలని కోరారు. పని ప్రదేశంలో సౌకర్యాలు లేక, రెండు మస్టర్ల విధానం వల్ల, మస్టర్ల కోసం పని ప్రదేశం నుంచి చాలా దూరం వెళ్లడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని దీనిని మార్చాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో పనులు అయిపోయాయని, వచ్చే వారం నుంచి పని ఉండదని చెప్పడంతో కూలీల ఆందోళన చెందుతున్నారన్నారు. జూన్ నెలాఖరు వరకు ఉపాధి హామీ పనులు చెప్పాలని డ్వామా పీడీని కోరినట్లు వివరించారు. మస్టర్ విధానంలో కూలీలకు న్యాయం చేసేందుకు మార్పులు చేశామని 500 మీటర్ల లోపే మస్టర్ పడేలా ఏర్పాటు చేసినట్లు పీడీ వెంకటలక్ష్మి చెప్పారన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరప: కౌమారదశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. మండలం వేళంగిలో కిశోరి బాలికలకు ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి, సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, అంగ్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

యోగాసనాలతో కార్మికుల నిరసన



పద్మాసనం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కాకినాడ సిటీ: ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్లు పరిష్కరించాలంటూ స్థానిక విక్టోరియా వాటర్ వర్క్స్ వద్ద చేస్తున్న సమ్మె మంగళవారంతో 35వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మద్దతు ప్రకటించారు. కార్మికుల సీనియార్టీ ప్రకారం జీతాలు పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలని తదితర సమస్యలపై డిప్యూటీ సీఎం తక్షణం స్పందించాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. పెరుగుతున్న అధిక ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సహనాన్ని పరీక్షించవద్దని, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి చిత్తశుద్ధితో తక్షణమే కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం



తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేస్తున్న అరవింద్

బోట్‌క్లబ్: ఎంతో మందికి వ్యక్తిత్వ వికాసంతో పాటు ఆంగ్లం బోధిస్తున్న అరవింద్ మంగళవారం తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేస్తున్నట్టు, తమతో పాటు మరో 20 మంది రక్తదానం చేసినట్లు చెప్పారు. మృత్యువుతో పోరాడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన అరవింద్, ఇతర సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణేష్, ఉప్పలపాటి బాలరాజు, స్వాతి, రజని పాల్గొన్నారు.

ఒలింపిక్ సంఘ సర్వసభ్య సమావేశం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఒలింపిక్ సంఘ సర్వసభ్య సమావేశం కాకినాడలో ఓ హోటల్‌లో సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒలింపిక్ సంఘ ఇన్‌చార్జి కార్యదర్శిగా జి.ఎలీషాబాబును, నిర్వహణ కార్యదర్శిగా వి.రవిరాజును సభ్యులు నామినేట్ చేశారు. ఈ ఏడాది ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే వివిధ కార్యక్రమాలను సమావేశంలో చర్చించారు. ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రు గోవిందరాజు, ప్యాట్రన్ కర్రి భామి రెడ్డి, ఉపాధ్యక్షుడు అర్జున రావు, లంక జార్జి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీలో టీడీపీ, జనసేనలది ఒకే విధానం



సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



పది గంటల పని విధానం ఉప సంహరించుకోవాలని సర్పవరం జంక్షన్‌లో తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా

కాకినాడ సిటీ: కార్మికులను దోచుకోవడంలో టీడీపీ, జనసేన పార్టీలది ఒకే విధానమని, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద గురువారం ఆందోళన చేశారు. నిర్బంధపు ఓవర్ డ్యూటీ చేయించడాన్ని మానుకోవాలని, భద్రత లేని రోజుల్లో శ్రామిక మహిళల చేత రాత్రిళ్లు పని చేయించడం ఆపాలని, ఏ రంగంలో పని చేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలంటూ ఆందోళనకారులు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు సంపద సృష్టి పెట్టుబడిదారులు చేస్తున్నప్పుడు కార్మికుల పని గంటలు పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పగటిపూటే భద్రత లేని సామాజిక పరిస్థితుల్లో రాత్రిళ్లు పని చేసే శ్రామిక మహిళల భద్రతకు ఎవరు బాధ్యత అని ప్రశ్నించారు. నిర్బంధంగా అధిక పని చేయించడం వల్ల కార్మికుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు తెలిపారు. ఇది కార్మికవర్గంపై చంద్రబాబు చేస్తున్న యుద్ధమని, తక్షణం పెంచిన పని గంటల ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం వేతనాలను సవరించి నేటికీ 14 ఏళ్లు కావొస్తోందన్నారు. ఈ కాలంలో ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, పెట్రోలు ధరలు, నిత్యావసర ధరలు పెంచుతూ కార్మికుల వేతనాలు మాత్రమే పెంచకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చంద్రమళ్ల పద్మ, మలకా వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల కన్వీనరు టి.రాజా మాట్లాడుతూ చంద్రబాబు ఆలోచన మేరకు సంపద సృష్టి పెట్టుబడిదారీ చేస్తున్నపడు కార్మికులు పని గంటలు ఎందుకు పెంచాల్సి వచ్చిందన్నారు. పగటి పూటే భద్రత లేని పరిస్థితుల్లో రాత్రులు పనిచేసే శ్రామిక మహిళల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని, కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు పెద్ద తేడా ఏమీ లేదన్నారు. సీఐటీయూ మండల నాయకులు వీరమణి, అన్నపూర్ణ, కనక మహాలక్ష్మి, కృప, ప్రసన్న, కిరణ్మయి, చక్రపాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై జన్మదిన వేడుకలు వద్దు

- త్వరలో ఆటో చార్జీల సవరణ
- ఆటో డ్రైవర్లకు ఎస్పీ హామీ



ఆటోడ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: రహదారులపై పుట్టిన రోజు వేడుకలు చేస్తే చర్యలు తప్పవనీ, మద్యం తాగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. అటువంటి వారి సమాచారం డయల్ 100 లేదా 112కి అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఆటో డ్రైవర్లు ఈ దిశగా చొరవ చూపాలని సూచించారు. మంగళవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 'చేరువ' కార్యక్రమం నిర్వహించారు. త్వరలో ఆటో చార్జీలు సవరిస్తామని ఆటో యూనియన్ నేతలకు ఎస్పీ హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలను పోలీస్ శాఖకు మరింత దగ్గర చేసేందుకు చేరువ పేరుతో దశలవారీ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ఎస్పీకి తమ సమస్యలు వివరించారు. కాకినాడ, సామర్లకోట, జి.మామిడాడ రూట్లు సరిగా లేక వాహనాలు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని వారు ఎస్పీకి వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరినైనా కాపాడి ఆసుపత్రిలో చేర్పితే, కేసులు, కోర్టులు, సాక్ష్యాలు అంటూ తమ సమయం వృథా అవుతుండడం జీవనోపాధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని తెలిపారు. ఈ వైఖరి వల్ల సహాయం చేయాలన్నా ఆలోచించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులను కొందరు బాధ్యతారహితంగా నడుపుతూ తమను ఇబ్బందిపెడుతున్నారని, మలుపుల్లో బస్సులు నిలుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని వివరించారు. తమ ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ తరఫున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. డ్రైవర్ల విన్నపాలపై స్పందించిన ఎస్పీ సానుకూలంగా స్పందించారు. పెరిగిన ఇంధన చార్జీలు భారంగా మారిన నేపథ్యంలో త్వరలో చార్జీల సవరిస్తామని. ప్రాణ రక్షణ కోసం పాటు పడిన ఆటోడ్రైవర్‌కు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని, అలాగే సహాయం చేసే క్రమంలో ఆటంకాలు ఏర్పడితే 94949 33233 నంబరుకు వాట్సప్ ద్వారా విన్నవించవచ్చన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ల వల్ల ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేందుకు సంస్థ అధికారులతో చర్చిస్తామని తెలిపారు. త్వరలో ఆటో డ్రైవర్ల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని అన్నారు. చేరువ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరుడు, ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది సహా ఆటోడ్రైవర్లు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

సహచరుడి కంటి వైద్యానికి రూ.2.5 లక్షల సాయం



సిబ్బంది సేకరించిన నగదును చంద్రశేఖర్‌కు అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: కంటి సంబంధ సమస్యతో బాధపడుతున్న తమ సహచరుడి కోసం ఏపీఎస్పీ 3వ బెటాలియన్ అధికారులు, సిబ్బంది బాసటగా నిలిచారు. వైద్యం నిమిత్తం రూ.2,50,650 సేకరించి అందించారు. వివరాల్లోకి వెళితే ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన నాలుగో తరగతి ఉద్యోగి బి.చంద్రశేఖర్‌కు కంటిలో పువ్వులో వచ్చి చూపు మందగించడంతో వైద్య ఖర్చుల కోసం కమాండెంట్ బి.నాగేంద్రరావును సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన బెటాలియన్‌లోని అధికారులు, సిబ్బందికి తెలియజేయడంతో వారంతా తమ చేతనైన సాయం చేయగా వాటిని మంగళవారం చంద్రశేఖర్‌కు అందజేశారు. దీంతో సిబ్బంది, పోలీసు అధికారులను కమాండెంట్ నాగేంద్రరావు అభినందించారు.

బాధిత కుటుంబానికి 'చేయూత'



బాధిత బాలుడి తండ్రికి చెక్‌ను అందిస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

కరప: లుకేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడు కుటుంబానికి చేయూత స్వచ్ఛంద సంస్థ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసింది. కరప మండలం కూరాడ శివారు చినమామిడాడ గ్రామానికి చెందిన ముప్పవరపు ముత్యాలు కుమారుడు బనీ లుకేమియాతో బాధపడుతున్నాడు. అనకాపల్లి జిల్లా అంకంపాలెంలోని హోమిబాబ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని పరిస్థితిని తెలుసుకున్న చినమామిడాడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, చేయూత సంస్థ ప్రతినిధి మహ్మద్ అలీం సహచర సభ్యులు మొండి రవికుమార్, చింతా నారాయణమూర్తిలకు వివరించారు. దీంతో వారు రూ.50 వేలను మంగళవారం కాకినాడలోని సంస్థ కార్యాలయంలో అందజేశారు.

14 నుంచి రాయితీపై బస్‌పాస్‌లు

బోట్‌క్లబ్: కాకినాడ ఆర్టీసీ డిపో పరిధిలోని అన్ని స్కూల్, కళాశాల విద్యార్థులకు ఈ నెల 14 నుంచి రాయితీపై బస్సు పాస్‌లను ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌ల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో బస్సు పాస్ కౌంటరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు రాయితీ బస్‌పాస్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యోగా ప్రాధాన్యం గుర్తించాలి



యోగా శిక్షణలో అవగాహన కల్పిస్తున్న యోగా గురువు కృష్ణమోహన్

కాకినాడ రూరల్: యోగా ద్వారా చక్కని ఆరోగ్యం లభిస్తుందని, ముఖ్యంగా వృద్ధులు ప్రశాంత జీవనం, మనశ్శాంతి కోసం యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి, తదనుణంగా ఆసనాలు, ప్రాణాయామం నేర్చుకోవాలని యోగా గురువు కృష్ణమోహన్ కోరారు. రమణయ్యపేటలో వృద్ధులకు యోగా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న విధుల బహిష్కరణ



ఆరోగ్య అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

బోట్‌క్లబ్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 9న మున్సిపల్ కార్మికులు తమ పనులు నిలిపివేస్తారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నగరపాలకసంస్థ హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్‌కు ఆయన కార్యాలయంలో సమ్మె నోటీసులు అందించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 12 గంటల పనిదినాలు పెంపును విరమించుకోవాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంగారు రాజేష్, జనిపల్లి అప్పన్న, రవీంద్ర, నాగేశ్వరావు, తాతారావు, మహేష్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఒక వృద్ధుడు రైలు ఢీకొని మంగళవారం మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ కథనం ప్రకారం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న గూడ్స్ రైలుకు అడ్డుగా సామర్లకోట సౌత్ కేబిన్ (ఫ్లైఓవర్ వైపు)వద్ద నిలబడటంతో అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. స్టేషన్ మేనేజరు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై పి.వాసు తెలిపారు. మృతుడు తెలుపు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని, సుమారు 65 ఏళ్లు ఉంటాయని, 5'6 ఎత్తుతో ఉన్నాడని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం వేములవాడ గ్రామానికి చెందిన పుణ్యమంతుల కృష్ణమూర్తి భార్యకు ఒక సంవత్సరం నుంచి మతిస్థిమితంలేక పోవడంతో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కానీ ఆమెకు వ్యాధి తగ్గక పోవడంతో ఆమె రాత్రుళ్లు పడుకోక, ఇంట్లోవారిని నిద్రపోనీయకపోవడంతో కృష్ణమూర్తి (67) మనస్తాపానికి గురై ఈనెల 3వ తేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో పొలంలో గడ్డిమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న అతని కుమారుడు ఏడుకొండలు చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్‌లో మేటి శారదాదేవి



80 ఏళ్ల వయసులో పతకాలు సాధించిన శారదాదేవి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): కాకినాడకు చెందిన వెటరన్ క్రీడాకారిణి వెదుళ్లపల్లి శారదాదేవి బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనపరుస్తూ వర్తమాన క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారు. శారదాదేవి స్థానిక పీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి నేచరోపతిలో డాక్టర్ చదివి ఎందరికో ఉచిత వైద్యం అందించారు. ఇటీవల గోవాలో జరిగిన 75 ప్లస్ విభాగంలో సింగిల్స్‌లో బ్రాంజ్ మెడల్, 70 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రతిభను చూపారు. ప్రస్తుతం ఈమె వయస్సు 80 సంవత్సరాలు. శారదాదేవిని బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులు అభినందించారు.

వైద్య విద్యార్థుల రక్తదానం



జీజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న వైద్య విద్యార్థులు, అధికారులు

కాకినాడ క్రైం: రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన 68 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. జీజీహెచ్‌లోని సర్జికల్ సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ప్రారంభించారు. రక్తదానం చేసి ప్రాణదానం చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డీఎల్‌వో ఆర్.రమేష్, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రజలకు సమయపాలన నేర్పాలని!

ఠంచనుగా ఐదు గంటలకే తహసీల్దార్ కార్యాలయం గేట్లు మూత

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం గేట్లు టంఛనుగా ఐదు గంటలకే మూసేస్తున్నారని, ఐదు గంటలకే 'కార్యాలయ వేళలు ముగిసినవి' అని బోర్డు పెడుతున్నారని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు పేర్కొన్నారు. అధికారులు ఉన్నంత వరకు ప్రజలు వారిని కలుసుకొనే అవకాశం ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ ప్రజలతో పాటు మండల పరిధిలోని 18 గ్రామాల ప్రజలు సుమారు 6 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి వస్తుంటారని, వారంతా ఈ బోర్డు చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆయన అన్నారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డిని ఈ విషయమై వివరణ కోరగా పని వేళలను ప్రజలకు అలవాటు చేయడానికి అలా బోర్డు పెట్టామని, అత్యవసర పనులపై వచ్చినవారి కోసం గేట్లు తీస్తామని తెలిపారు. నిత్యం ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ముఖ్యమైన పనులకు అవకాశం ఉండడం లేదని, అందువల్ల సమయం కాగానే గేట్లు మూసేస్తున్నామని వివరించారు.